


జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




| సోమవారం 11 మే 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 343 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|



## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నివాసానికి వెళ్లిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 11, ప్రతినిధి: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు సాయంత్రం హైదరాబాద్‌లోని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నివాసానికి వెళ్లారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి పవన్ కళ్యాణ్ కుటుంబ సభ్యులు హార్దిక స్వాగతం పలికారు. ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను ప్రధానమంత్రి పరామర్శించారు. సుమారు ఇరవై నిమిషాల పాటు అక్కడే ఉండి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. స్వయంగా వచ్చి పరామర్శించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి పవన్ కళ్యాణ్ ధన్యవాదాలు తెలిపారు.



## కాంగ్రెస్ అవకాశవాది పార్టీ.. స్వదేశీ వినియోగంతోనే దేశాభివృద్ధి: ప్రధాని నరేంద్ర మోదీ

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 11, ప్రతినిధి: కాంగ్రెస్ పార్టీ అవకాశవాద రాజకీయాలకు పాల్పడుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర స్థాయిలో విమర్శించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సభలో మాట్లాడిన ఆయన, అధికారంలోకి రావడం కోసం కాంగ్రెస్ ఎంతకైనా దిగజారుతుందని ఆరోపించారు. తమిళనాడులో తన మిత్రపక్షమైన డీఎంకేకు కూడా కాంగ్రెస్ వెన్నుపోటు పొడిచిందని వ్యాఖ్యానించారు. రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ తన మిత్రులను కూడా వదలదని అన్నారు. కాంగ్రెస్ విద్వేష రాజకీయాలను రెచ్చగొడుతోందని, "ఎంఎంసీ" అంటే "ముస్లిం లీగ్–మావోయిస్టు కాంగ్రెస్" అని విమర్శించారు. మావోయిస్టుల కారణంగా తెలంగాణ తీవ్రంగా నష్టపోయిందని, కాంగ్రెస్ మరియు వామపక్ష పార్టీలు మావోయిస్టులకు అండగా నిలిచాయని ఆరోపించారు. తెలంగాణ పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చి ఉంటే మావోయిస్టు కార్యకలాపాలను చాలా ముందుగానే అణిచివేసేవారని పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణ మావోయిస్టు రహిత రాష్ట్రంగా మారుతోందని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చినందుకు ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారని, రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై అసంతృప్తి పెరుగుతోందని అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ కుటుంబ ఆధారిత రాజకీయాలను కొనసాగిస్తున్నాయని విమర్శించారు. దేశవ్యాప్తంగా 14 పారిశ్రామిక కారిడార్ల నిర్మాణం జరుగుతోందని, వాటిలో ఒకటి జహీరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దీని ద్వారా తెలంగాణ పారిశ్రామిక రంగానికి మరింత ఊతం లభిస్తుందని చెప్పారు. దేశ ప్రజలు ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని సూచించిన మోదీ, కనీసం ఒక సంవత్సరం పాటు విదేశీ పర్యటనలు, బంగారం కొనుగోళ్లు తగ్గించాలని పిలుపునిచ్చారు. వంటనూనెల వినియోగాన్ని తగ్గించడం ద్వారా దిగుమతుల భారం తగ్గుతుందని పేర్కొన్నారు. రసాయన ఎరువుల అధిక వినియోగం భూమి సారాన్ని దెబ్బతీస్తోందని, సహజ మరియు సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహిస్తే విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయడంతో పాటు భూమి ఆరోగ్యాన్ని కాపాడవచ్చని వివరించారు. వ్యవసాయంలో డీజిల్ పంపులకు బదులుగా సౌరశక్తితో పనిచేసే పంపులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. స్వదేశీ అంటే కేవలం పండుగల సమయంలో మట్టి దీపాలు కొనడం మాత్రమే కాదని, దైనందిన జీవితంలో భారతదేశంలో తయారైన ఉత్పత్తులను వినియోగించడమే నిజమైన స్వదేశీ భావన అని స్పష్టం చేశారు. దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా భారత ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ యుద్ధ పరిస్థితుల వల్ల ఇంధన సంక్షోభం నెలకొన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను పెంచకుండా ప్రజలపై భారం పడకుండా చూస్తోందన్నారు. ప్రజలు వ్యక్తిగత వాహనాల కంటే మెట్రో రైలు సేవలను ఎక్కువగా వినియోగించాలని సూచించారు.




## ప్రధాని మోదీ తెలంగాణ పర్యటనలో సీఎం రేవంత్ కీలక ప్రతిపాదన

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 11, ప్రతినిధి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రతిపాదనను ముందుకు తీసుకొచ్చారు. హైదరాబాద్‌లో ప్రధాని సమక్షంలో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవ సభలో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి, దేశంలోని ఆరు ప్రధాన మహానగరాలైన ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు మరియు హైదరాబాద్ నగరాలకు సంబంధించిన జాతీయ ప్రాధాన్యత గల ప్రాజెక్టులకు త్వరితగతిన అనుమతులు ఇవ్వడానికి ప్రధానమంత్రి కార్యాలయంలో ప్రత్యేక సింగిల్ విండో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ నగరాలు దేశ ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి ప్రాజెక్టులకు వేగవంతమైన క్లియరెన్స్ వ్యవస్థ అవసరమని, అలాంటి వ్యవస్థ ఉంటే పెట్టుబడులు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని తెలిపారు. అలాగే యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలంటే మెగా నగరాల అభివృద్ధి అత్యంత ముఖ్యమని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు.


## వైభవంగా రైతు వారోత్సవాలు.. రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

Inauguration of Stalls at Mega Rythu Mela




సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 11, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మే 4 నుండి 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన "రైతు వారం" కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి. వ్యవసాయ శాఖతో పాటు ఉద్యానవన, పట్టు పరిశ్రమ, విద్యుత్, మార్కెటింగ్, సహకార, పశుసంవర్ధక, మత్స్య మరియు నీటిపారుదల శాఖల సమన్వయంతో రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, శాస్త్రీయ వ్యవసాయం, యాంత్రీకరణ, మార్కెటింగ్, పశుసంవర్ధక మరియు నీటి వినియోగంపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించారు. మే 4న వికారాబాద్ జిల్లా తాండూరులో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతు వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సేంద్రియ రైతులు పండించిన ఉత్పత్తుల కొనుగోలు, విక్రయాల కోసం తెలంగాణ రాష్ట్ర విత్తన మరియు సేంద్రియ ధృవీకరణ అథారిటీ రూపొందించిన "టీజీ ఆర్గానిక్స్" మొబైల్ యాప్‌ను ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన రైతు వారోత్సవాల్లో 2,22,762 మంది రైతులు, 5,850 మంది అధికారులు, 8,157 మంది ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. 14,565 మట్టి నమూనాలను సేకరించి 20,734 మట్టి విశ్లేషణ పత్రాలను రైతులకు అందజేశారు. నానో ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయం, సన్న వరి సాగు వంటి అంశాలపై శాస్త్రీయ అవగాహన కల్పించారు. వినియోగదారులు ఎక్కువగా కోరుకునే బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-15048, హెచ్ఎంటీ, జైశ్రీరామ్, కేఎన్ఎం-1638, డబ్ల్యూజీఎల్-44, డబ్ల్యూజీఎల్-962, జేజీఎల్-1798 వంటి వరి రకాలను సాగు చేయాలని శాస్త్రవేత్తలు సూచించారు. మే 5న హనుమకొండలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రైతు మేళాలో ప్రత్యామ్నాయ పంటలు, ముఖ్యంగా ఆయిల్ పామ్, నూనె గింజలు, పప్పుధాన్యాల సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చారు. బిందు సేద్యం, నీటి పొదుపు సాంకేతికతలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. మే 6న రైతులకు పంట రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు, సహకార సంఘాల సేవలు, గోదాముల నిల్వ సదుపాయాలు, కనీస మద్దతు ధర మరియు మార్కెటింగ్ అవకాశాలపై అధికారులు వివరించారు. మే 7న ఆధునిక వ్యవసాయ యంత్రాలు, డ్రోన్ సాంకేతికత ప్రదర్శనలు నిర్వహించి 1,344 వ్యవసాయ యంత్రాలను ప్రదర్శించగా 370 మంది రైతుల నుండి యంత్రాల కోసం దరఖాస్తులు స్వీకరించారు. పీఎం కుసుమ్ పథకం కింద సౌర విద్యుత్ ప్లాంట్లు, సబ్సిడీలపై అవగాహన కల్పించారు. రైతు వారం కార్యక్రమాల్లో పాల్గొన్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులు పండించిన వరి, మొక్కజొన్న, జొన్న పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటుందని తెలిపారు. రైతులు అధిక ఆదాయం ఇచ్చే ఆయిల్ పామ్, పప్పుధాన్యాలు, కూరగాయలు, పూల సాగు వైపు మొగ్గుచూపాలని సూచించారు. ఈ వానాకాలానికి అవసరమైన ఎరువులు, విత్తనాలు ముందస్తుగానే అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ మరియు అనుబంధ రంగాల ప్రదర్శన స్టాళ్లను మంత్రి తిలకించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, వ్యవసాయ సంచాలకులు డాక్టర్ బి. గోపి, ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. రైతు వారం ఐదవ రోజున పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 593 కృత్రిమ గర్భధారణ శిబిరాలు నిర్వహించి 35,336 పశువులకు వైద్య పరీక్షలు చేపట్టారు. 2,654 మంది రైతులకు పచ్చిగడ్డి విత్తనాలు పంపిణీ చేశారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపల ఉత్పత్తి పెంపు, చెరువుల నిర్వహణపై అవగాహన కల్పించారు. వేసవిలో పశువుల సంరక్షణ, పచ్చిగడ్డి సాగు, సమగ్ర నీటి వినియోగం, నీటి లభ్యత ఆధారంగా పంటల ప్రణాళికపై రైతులకు వివరించారు. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో కాలువల మరమ్మత్తులు, చెరువుల పూడికతీత, గట్లపై పిచ్చిమొక్కలు, కంపచెట్లు, గుర్రపుడెక్క తొలగింపు, కాలువల శుభ్రత కార్యక్రమాల ప్రాముఖ్యత వివరించారు. చెరువుల నల్లమట్టి వినియోగం వల్ల నేల సారవంతం పెరుగుతుందని రైతులకు తెలియజేశారు. మే 9న సమతుల్య నీటి వినియోగం, చెరువుల శుభ్రతపై అవగాహన కార్యక్రమాలతో రైతు వారోత్సవాలు విజయవంతంగా ముగిశాయి. రైతులకు శాస్త్రీయ అవగాహన, ఆధునిక సాంకేతికత, ఆర్థిక భరోసా అందిస్తూ వ్యవసాయాభివృద్ధికి ఈ కార్యక్రమాలు దోహదపడుతున్నాయని, రైతు సంక్షేమంతో తెలంగాణ వ్యవసాయ రంగం మరింత బలోపేతం అవుతుందని వ్యవసాయ సంచాలకులు డాక్టర్ బి. గోపి తెలిపారు.

## తెలంగాణ అభివృద్ధికి కేంద్రం పూర్తి సహకారం అందించాలి: సీఎం రేవంత్ రెడ్డి



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 11, ప్రతినిధి: హైదరాబాద్ హెచ్ఐసీసీలో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రసంగం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మరియు ఇతర ప్రముఖులకు స్వాగతం పలికిన సీఎం, ఇది రాజకీయ కార్యక్రమం కాదని, అభివృద్ధి ఉత్సవమని పేర్కొన్నారు. జాతీయ భద్రత, జాతీయ అభివృద్ధే తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. "ముందు దేశం, తర్వాత ప్రజలు, ఆ తరువాతే పార్టీ" అనే భావనతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించిన "వికసిత్ భారత్–2047" లక్ష్యాలకు అనుసంధానంగా "తెలంగాణ రైజింగ్–2047" దిశగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. తెలంగాణను దేశంలో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు కృషి చేస్తున్నామని, కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్క్, రైల్వే ప్రాజెక్టుల ప్రారంభానికి మోదీ రావడం ఆనందంగా ఉందన్నారు. అయిదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన తరువాత ప్రధాని అభివృద్ధి కార్యక్రమాల కోసం రావడం శుభపరిణామమని పేర్కొన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ సహకారంతో మోదీ గుజరాత్ మోడల్‌ను అభివృద్ధి చేశారని గుర్తుచేసిన సీఎం, అదే విధంగా తెలంగాణ అభివృద్ధికి కూడా పూర్తి సహకారం అందించాలని కోరారు. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. దేశ ఆర్థికాభివృద్ధిలో ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్ వంటి మహానగరాలు కీలకమని, యువతకు ఉపాధి అవకాశాలు పెరగాలంటే ఈ నగరాల అభివృద్ధి అత్యవసరమని పేర్కొన్నారు. ఈ ఆరు మెట్రో నగరాలకు సంబంధించిన జాతీయ ప్రాధాన్యత గల ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు లభించేలా ప్రధానమంత్రి కార్యాలయంలో ప్రత్యేక సింగిల్ విండో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. తెలంగాణకు సంబంధించిన మూసీ నది అభివృద్ధి, మెట్రో రైలు, రేడియల్ రోడ్లు, హైదరాబాద్–మచిలీపట్నం 12 వరుసల రహదారి వంటి ప్రాజెక్టులకు కేంద్రం అత్యవసర అనుమతులు ఇవ్వాలని కోరారు. తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన పెండింగ్ ప్రతిపాదనలను కేంద్రం ఆమోదిస్తుందని రాష్ట్ర ప్రజలు ఆశిస్తున్నారని తెలిపారు. దేశ అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని స్పష్టం చేసిన సీఎం, "జై తెలంగాణ – జై భారత్" అంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

## ఎన్‌హెచ్ఏఐ చైర్మన్‌తో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భేటీ



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 11, ప్రతినిధి: నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్‌తో రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఎన్‌హెచ్ఏఐ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మరియు చేపట్టబోయే పలు జాతీయ రహదారి ప్రాజెక్టులపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా రీజినల్ రింగ్ రోడ్డు, హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనుల ప్రారంభంపై మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. నిత్యం ప్రమాదాలతో "డెత్ రోడ్"గా మారిన హైదరాబాద్–విజయవాడ రహదారిని ఎనిమిది లేన్లుగా విస్తరించే పనులను అత్యవసరంగా చేపట్టాలని కోరారు. అదే రహదారిలో ఎల్‌బీనగర్ నుండి హయత్‌నగర్ వరకు నాగపూర్ తరహాలో 7.1 కిలోమీటర్ల డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుని, డీపీఆర్‌ను కేంద్ర రహదారుల శాఖకు పంపిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి మరియు రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తి చేసి అతి త్వరలో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్‌హెచ్ఏఐ చైర్మన్ మంత్రికి వివరించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగస్వామ్యంగా నిలిచే ఈ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. సమావేశంలో రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ప్రత్యేక కార్యదర్శి ప్రవీణ్య, ఎన్‌హెచ్ఏఐ ప్రాంతీయ అధికారి శివశంకర్, ఆర్ అండ్ బి ప్రధాన ఇంజినీర్లు ధర్మారెడ్డి, రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో పలు శుభకార్యాలకు హాజరైన లింగాల కమల్‌రాజు



సందేశం టైమ్స్, మధిర, మే 11, ప్రతినిధి: మధిర నియోజకవర్గంలోని ఎర్రుపాలెం, బోనకల్లు మండలాల్లో నిర్వహించిన పలు శుభకార్యాలకు మాజీ జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎర్రుపాలెం మండలంలోని మీనవోలు గ్రామంలో జరిగిన బండారు రాంబాబు వివాహ కార్యక్రమానికి హాజరైన ఆయన, అనంతరం అదే గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు మెహిద్దీన్ వివాహ వేడుకలో పాల్గొన్నారు. తరువాత బోనకల్లు గ్రామంలో నిర్వహించిన యార్లగడ్డ శ్రీను కుమారుడి వివాహ కార్యక్రమానికి హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భూక్యా సైదానాయక్ కుమారుడి రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, ఎర్రుపాలెం మండల నాయకుడు యన్నం శ్రీనివాసరెడ్డి, సీనియర్ నాయకులు హుసేన్, మాజీ ఎంపీటీసీ మల్లికార్జున్ రెడ్డి, రామిశెట్టి రామకృష్ణ, తోట శ్రీనివాసరావు, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు. బోనకల్లు కార్యక్రమంలో సర్పంచ్ బానోత్ జ్యోతి, ఉపసర్పంచ్ కొండ, గుండపునేని సుధాకర్‌రావు, తేళ్ళూరి రమేష్, ప్రసాద్, శ్రీను, బాజీ తదితరులు పాల్గొన్నారు.

## మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పీవీ రావు 77వ జయంతి ఘనంగా నిర్వహణ



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 11, జిల్లా కోఆర్డినేటర్: మాల ఉద్యోగుల సంఘం సంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో పీవీ రావు 77వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు బక్కన్న మాట్లాడుతూ పీవీ రావు ఆంధ్రప్రదేశ్‌లో మాల సామాజిక వర్గ ప్రయోజనాల పరిరక్షణ కోసం 1990ల చివర్లో ఏర్పడిన ప్రముఖ సామాజిక, రాజకీయ సంస్థ "మాల మహానాడు" వ్యవస్థాపక అధ్యక్షుడిగా విశేష సేవలు అందించారని తెలిపారు. ఎస్సీ ఉపవర్గీకరణకు వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి ఆయన నాయకత్వం వహించారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ సమాచార పౌర సంబంధాల శాఖలో మాజీ తెలుగు సంపాదకుడిగా పనిచేసిన పీవీ రావు, రాష్ట్ర ప్రభుత్వ రిజర్వేషన్ విధానాలకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టిన కారణంగా ఉద్యోగాన్ని కోల్పోయారని గుర్తు చేశారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఉద్యమానికి వ్యతిరేకంగా మాల సమాజాన్ని ఏకం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. పీవీ రావు నాయకత్వంలో మాల మహానాడు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని న్యాయపరంగా సవాల్ చేయడంతో 2004లో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పులో ఎస్సీల ఉపవర్గీకరణ అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి లేదని, ఆ అధికారం కేవలం పార్లమెంటుకే ఉందని స్పష్టం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఉండరికం, జనరల్ సెక్రటరీ బి. రాజు, బి. నాగయ్య, ఎస్సీ ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ మాజీ అధ్యక్షులు, ఈ. జనార్ధన్ మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఎస్. సంజీవులు తెలుగు పండిత్ సంగారెడ్డి, ఎం. విజయరావు గౌరవాధ్యక్షులు మాల ఉద్యోగుల సంఘం, ఎం. శ్రీనివాసులు ఈసీ సభ్యులు, టి. అనంత్‌రామ్ సబ్ రిజిస్ట్రార్ తదితరులు పాల్గొన్నారు.

## జనగణనకు మండల ప్రజలందరూ సహకరించాలి

సందేశం టైమ్స్, చింతకాని, మే 11, ప్రతినిధి: జనగణన–2027 కార్యక్రమంలో భాగంగా మొదటి విడత ఇండ్ల గణన కార్యక్రమం మే 11, 2026 నుండి జూన్ 9, 2026 వరకు నిర్వహించనున్నట్లు సెన్సస్ ఛార్జ్ ఆఫీసర్, తహసీల్దార్ జె. బాబ్జి ప్రసాద్ తెలిపారు. రెండవ విడతలో కుటుంబ సభ్యుల వివరాల సేకరణ కార్యక్రమం ఫిబ్రవరి–2027లో చేపట్టనున్నట్లు వెల్లడించారు. చింతకాని మండలంలో 80 మంది ఎన్యూమరేటర్లు, 14 మంది సూపర్వైజర్లు కలిపి మొత్తం 94 మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. జనగణన కార్యక్రమం విజయవంతం కావడానికి మండల ప్రజలందరూ పూర్తి సహకారం అందించాలని తహసీల్దార్ జె. బాబ్జి ప్రసాద్, అదనపు ఛార్జ్ ఆఫీసర్, ఎంపీడీవో సిహెచ్. శ్రీనివాసరావు కోరారు. ఇదే సమయంలో మోసగాళ్లు, నకిలీ సిబ్బంది పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. జనగణన పేరుతో కొంతమంది నకిలీ గుర్తింపు కార్డులు ఉపయోగిస్తూ ఇంటింటికి తిరుగుతూ వ్యక్తిగత వివరాలు సేకరించే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం అందుతోందన్నారు. అధికారిక జనగణన సిబ్బంది ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డులు కలిగి ఉంటారని, వాటిపై ఉన్న క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వారి వివరాలను ధృవీకరించుకోవచ్చని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన పక్షంలో వెంటనే స్థానిక పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

## ఘనంగా ప్రపంచ మాతృ దినోత్సవ వేడుకలు



సందేశం టైమ్స్, పటాన్‌చెరు, మే 11, సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్: ప్రపంచ మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని పటాన్‌చెరు పట్టణంలోని ఎండీఆర్ ఫౌండేషన్ కార్యాలయంలో ప్రత్యేక సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గత నాలుగు సంవత్సరాలుగా మాతృత్వపు కొత్త ప్రయాణాన్ని ప్రారంభించిన తల్లులు మరియు వారి చిన్నారులకు బేబీ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండీఆర్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకుడు మాద్రి పృథ్వీరాజ్, ఆయన తల్లి మాద్రి తులసి లక్ష్మి పాల్గొని బాలింతలకు బేబీ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ "అమ్మ ప్రేమకు ప్రత్యామ్నాయం లేదని, తల్లులు కుటుంబానికే కాకుండా సమాజ నిర్మాణానికి కూడా మూలస్తంభాలని" అన్నారు. ప్రతి తల్లి ఆరోగ్యంగా, గౌరవంగా జీవించే సమాజ నిర్మాణమే తమ లక్ష్యమని, మహిళలు, బాలింతలు, చిన్నారుల సంక్షేమం కోసం ఎండీఆర్ ఫౌండేషన్ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. మాతృదినోత్సవం సందర్భంగా ప్రతి తల్లికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మాద్రి తులసి లక్ష్మి మహిళలతో కలిసి కేక్ కట్ చేసి మాతృదినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందిస్తూ, ఆరోగ్య సంరక్షణ, విద్య, మహిళా సాధికారత, బాలల సంక్షేమ రంగాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలు ప్రజల విశ్వాసాన్ని సంపాదించాయని పేర్కొన్నారు. అవసరమైన వర్గాలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు కొనసాగించడం అభినందనీయమని తెలిపారు. ఫౌండేషన్ అధ్యక్షులు మధు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలు, బాలింతల సంక్షేమం కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.


## పటాన్‌చెరువులో ఘనంగా శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ మూడవ వార్షిక మహోత్సవం





సందేశం టైమ్స్, పటాన్‌చెరు, మే 11, బి. డేవిడ్: జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి ఆలయ మూడవ వార్షిక మహోత్సవం ఆలయ ధర్మకర్త, పటాన్‌చెరువు మాజీ కార్పొరేటర్ రమాదేవి మెట్టు కుమార్ యాదవ్ మరియు ఆలయ కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, ధార్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆలయ వార్షికోత్సవ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మెట్టు కుమార్ యాదవ్ దంపతులు, ఆలయ కార్యవర్గ సభ్యులు, అన్నసమారాధన వితరణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. గోపాల్‌రెడ్డి దంపతులు, మురళీధర్ దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారికి ప్రత్యేక సేవలు సమర్పించారు. ఈ సందర్భంగా మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి భగవంతుని ఆశీర్వాదంతో ఆలయ నిర్మాణం పూర్తి చేశామని, నేడు శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి ఆలయ మూడవ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.

## జోగిపేట మాజీ మున్సిపల్ ఛైర్మన్ కుమారుడి వివాహానికి బీజేపీ నాయకుల హాజరు



సందేశం టైమ్స్, అందోల్ మండల ప్రతినిధి, మే 11: జోగిపేట మాజీ మున్సిపల్ ఛైర్మన్ కవిత సురేందర్ గౌడ్ కుమారుడు తరుణ్ వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ వివాహ మహోత్సవానికి బీజేపీ జోగిపేట మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు మరియు ముఖ్య నాయకులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నాయకులు వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. వివాహ వేడుకలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, రాజకీయ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అత్యంత వైభవంగా నిర్వహించిన ఈ వివాహ వేడుక ఆహూతులను ఆకట్టుకుంది.

## పటాన్‌చెరు హోటల్‌లో అగ్నిప్రమాదం తప్పిన పెను ప్రమాదం




సందేశం టైమ్స్, పటాన్‌చెరు, మే 11, బి. డేవిడ్: పటాన్‌చెరు బస్టాండ్ పక్కన ఉన్న ఖానావల్లి హోటల్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. మంటలు ఒక్కసారిగా వేగంగా వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. హోటల్ యాజమాన్యం అప్రమత్తమై లోపల ఉన్న వారిని సురక్షితంగా బయటకు తరలించింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో హోటల్ యజమానికి స్వల్ప గాయాలు కాగా, పెద్ద ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

## సంగారెడ్డి జిల్లాలో విజయవంతంగా ముగిసిన రైతు వారోత్సవాలు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 11, ప్రతినిధి: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక"లో భాగంగా మే 4 నుండి 9 వరకు సంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన "రైతు వారం" కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి. వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖల సమన్వయంతో రైతులకు ఆధునిక సాగు విధానాలు, శాస్త్రీయ వ్యవసాయం, యాంత్రీకరణ, పశుసంవర్ధక, ఉద్యానవన, మార్కెటింగ్ మరియు నీటిపారుదల అంశాలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించారు. జిల్లాలో మొత్తం 116 రైతు వేదికల్లో కార్యక్రమాలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. నేల ఆరోగ్య పరీక్షలు, నానో ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయం, సన్నవరి సాగు వంటి అంశాలపై రైతులకు శిక్షణ ఇచ్చి 575 మంది రైతులకు మట్టి విశ్లేషణ ఆరోగ్య కార్డులు పంపిణీ చేశారు. మనూరు రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమానికి నారాయణఖేడ్ ఎమ్మెల్యే పటోళ్ల సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. శాస్త్రీయ పద్ధతులు అనుసరిస్తే రైతులు ఆర్థికంగా మరింత బలోపేతం అవుతారని సూచించారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్, నూనె గింజలు, పప్పుధాన్యాల సాగుపై ప్రత్యేక శిక్షణ ఇచ్చి నీటి పొదుపు సాంకేతికతలు, బందు సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు మార్కెటింగ్ అవకాశాలు, కనీస మద్దతు ధర, గోదాముల నిల్వ సదుపాయాలు, పంట రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలో రెండు వేలకుపైగా రైతులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వ్యవసాయ యాంత్రీకరణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ డ్రోన్ సాంకేతికత ప్రదర్శనలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో ఆధునిక వ్యవసాయ యంత్రాల వినియోగంపై రైతులకు ప్రాక్టికల్ డెమోలు ఇచ్చి యంత్రాల కోసం దరఖాస్తులు స్వీకరించారు. అదేవిధంగా పీఎం కుసుమ్ పథకం కింద సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి పశువులకు వైద్య పరీక్షలు, కృత్రిమ గర్భధారణ సేవలు అందించడంతో పాటు పచ్చిగడ్డి విత్తనాలు పంపిణీ చేశారు. మత్స్యశాఖ ద్వారా చేపల పెంపకం, చెరువుల నిర్వహణపై రైతులకు శిక్షణ ఇచ్చారు. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో చెరువుల పూడికతీత, కాలువల మరమ్మతులు, సమతుల్య నీటి వినియోగం, చెరువుల శుభ్రత కార్యక్రమాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులు పండించిన వరి, మొక్కజొన్న, జొన్న పంటలను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, అధిక ఆదాయం వచ్చే ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని సూచించారు. రైతు వారోత్సవాల ద్వారా శాస్త్రీయ దృక్పథం, ఆధునిక సాంకేతికత, మార్కెటింగ్ అవగాహన, ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు.

## మదర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహణ.. అమ్మ ప్రేమకు వందనం





సందేశం టైమ్స్, వట్పల్లి, మే 11, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల పరిధిలోని మర్వెల్లి గ్రామంలో తమ్మాలి అనసూయ, తమ్మాలి సంగమ్మ ఆధ్వర్యంలో మదర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని తల్లి ప్రేమను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ కార్యక్రమం భావోద్వేగ వాతావరణంలో సాగింది. "అమ్మ ప్రేమ అనేది మాటల్లో చెప్పలేనిది.. అది మన హృదయంలోనే అనుభూతి చెందాల్సిందే" అనే సందేశాలతో ప్రతి ఒక్కరి మనసును కదిలించారు. ప్రపంచంలో నిజమైన దేవత అమ్మ మాత్రమేనని, మన జీవితం ప్రారంభమైన తొలి సురక్షిత స్థలం అమ్మ ఒడేనని పలువురు పేర్కొన్నారు. అమ్మ ఒక పదం కాదని, అంతులేని ప్రేమకు ప్రతీక అని, ఆమె చిరునవ్వు మన కష్టాలను సైతం సులభం చేస్తుందని భావోద్వేగంగా తెలిపారు. జీవితంలో ఎవరూ అర్థం చేసుకోలేని సందర్భాల్లో కూడా మనసును అర్థం చేసుకునేది అమ్మ మాత్రమేనని, ఆమె ప్రేమకు ఎలాంటి అర్హత అవసరం లేదని, అది ఎప్పటికీ మనతోనే ఉంటుందని పేర్కొన్నారు. అమ్మ చేతి వంటలో ప్రేమ రుచి కలిసివుంటుందని, ప్రపంచం మొత్తం దూరమైనా అమ్మ మాత్రం ఎల్లప్పుడూ మనవైపే ఉంటుందని చెబుతూ, అమ్మ అంటే ఆప్యాయత, ఆత్మీయత, అండ అన్నీ ఒక్కటేనని ఈ మదర్స్ డే సందేశాలు స్పష్టం చేశాయి.

# మాతృదినోత్సవ సందర్భంగా తల్లులందరికీ జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు



సందేశం టైమ్స్, మే 11, ప్రతినిధి: "సృష్టికి మూలం అమ్మ. నిస్వార్థమైన ప్రేమకు, సహనానికి నిలువుటద్దం తల్లి. ఒక బిడ్డ ఎదుగుదలలోనే కాకుండా సమాజ నిర్మాణంలో కూడా తల్లుల పాత్ర వెలకట్టలేనిది" అని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పేర్కొన్నారు. మాతృదినోత్సవం సందర్భంగా ఆయన తల్లులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మనందరినీ తీర్చిదిద్దిన తల్లుల త్యాగం, ప్రేమ, ఆప్యాయతలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని సూచించారు. "హ్యాపీ మదర్స్ డే" అంటూ అన్ని తల్లులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# ఇకపై ప్రతి సోమవారం ఆర్డీఓ కార్యాలయాల్లో ప్రజావాణి

సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 11, ప్రతినిధి: ఇకపై ప్రతి సోమవారం రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆర్డీఓలను ఆదేశించారు. ఇప్పటివరకు జిల్లా కేంద్రంలో మాత్రమే ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుండగా, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇకపై ప్రతి సోమవారం సంబంధిత ఆర్డీఓ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలను నేరుగా ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో సమర్పించవచ్చని తెలిపారు. డివిజన్ స్థాయి ప్రజావాణికి రెవెన్యూ డివిజనల్ అధికారి బాధ్యత వహిస్తారని పేర్కొన్నారు. అలాగే డివిజన్ పరిధిలోని అన్ని శాఖల డివిజనల్ అధికారులు ప్రజావాణి కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.

# పుల్కల్ శివాలయంలో ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 11, ప్రతినిధి: మండల కేంద్రం పుల్కల్‌లో నూతనంగా నిర్మించిన శివాలయంలో విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మఠం భిక్షపతిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ లావణ్య కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసాచారి, మాజీ సర్పంచ్ శ్రావణ్, వార్డు సభ్యుడు అభిక్‌తో పాటు పలువురు గ్రామస్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# పలు వివాహ వేడుకలకు హాజరైన ఆవుల రాజిరెడ్డి



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 11, ప్రతినిధి: నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ఉమ్మడి మెదక్ జిల్లాలో పలు ప్రాంతాల్లో నిర్వహించిన వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వివాహ వేడుకల్లో పాల్గొన్న ఆయన వధూవరులు ఆనందంగా, ఆయురారోగ్యాలతో దాంపత్య జీవితం కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# నరసింహారెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 11, ప్రతినిధి: నర్సాపూర్ నియోజకవర్గంలోని శివంపేట మండలం కొత్తపేట గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ రమాకాంత్ రెడ్డి తండ్రి స్వర్గీయ కీర్తిశేషులు నరసింహారెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి బండారి గంగాధర్ నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయిని రవీందర్ రెడ్డి, కుమ్మరి నాగరాజు, శేఖర్ గౌడ్, సానె ఆనంద్, పిల్లి మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



# విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 11, ప్రతినిధి: 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 11వ తేదీ నుండి 17వ తేదీ వరకు నిర్వహించనున్న విద్యా వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలలో విద్యాశాఖ భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అన్ని కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల నమోదు పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. విద్యా వారోత్సవాల తొలి రోజు భవిత కేంద్రం మెదక్ సెంటర్‌లో ALIMCO ఆధ్వర్యంలో ఎంపికైన 128 మంది విద్యార్థులకు రూ.9,51,233 విలువైన ఉపకరణాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 24 పీఎం శ్రీ పాఠశాలలు, చేగుంట కేజీబీవీలో 15 రోజుల పాటు ఆర్ట్స్, కల్చరల్, డాన్స్, మ్యూజిక్ తదితర రంగాలలో సమ్మర్ క్యాంపులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మే 12న పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం పాపన్నపేట, నర్సాపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించి అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం చేయాలని సూచించారు. మే 13న ప్రతి నియోజకవర్గ స్థాయిలో సర్పంచ్‌లు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లకు వర్క్‌షాప్‌లు నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపుపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. మే 16న ప్రతి పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం, పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించడంతో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో బుక్ ఎగ్జిబిషన్‌లు నిర్వహించాలని తెలిపారు. అదే రోజు జిల్లా స్థాయిలో ఆర్ట్, క్రాఫ్ట్, కల్చరల్ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించాలని సూచించారు. మే 17న జరిగే ముగింపు సమావేశంలో ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు క్రీడల్లో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు రూ.10 వేల నగదు పురస్కారంతో సన్మానం చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని పాఠశాలల్లో మౌలిక వసతుల సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, అవసరమైన సహకారం అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

# ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలి: ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 11, ప్రతినిధి: మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను సూచించారు. ఆదివారం సాయంత్రం పాపన్నపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యాన్ని పరిశీలించిన ఆయన, కొనుగోలు ప్రక్రియలో రైస్ మిల్లర్లు ఇబ్బందులు కలిగిస్తున్నారని స్థానిక రైతులు, నాయకులు ఆయన దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించి పలువురు రైస్ మిల్లర్లతో ఫోన్‌లో మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మిల్లుకు వచ్చిన వెంటనే ధాన్యాన్ని వెంటనే ఖాళీ చేసి కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని మిల్లర్లకు సూచించారు. రైతులు అధైర్యపడవద్దని, పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. కొనుగోలు ప్రక్రియను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరేందర్ గౌడ్, మండల నాయకులు ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంతప్ప, హీరాలాల్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# 2029 నాటికి తెలంగాణలో బీసీల జెండానే ఎగురుతుంది: తీన్మార్ మల్లన్న



సందేశం టైమ్స్, జనగామ, మే 11, ప్రతినిధి: జనగామలో నిర్వహించిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ సమావేశంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవ పోరాటంపై కీలక వ్యాఖ్యలు చేస్తూ 2029 నాటికి తెలంగాణలో బీసీల జెండానే ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఇది బడుగు వర్గాల సభ అని, రెడ్లు, వెలమలకు ఈ వేదికలో చోటు లేదని స్పష్టం చేసిన ఆయన, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు భూముల దోపిడీలో ఒకే తీరులో వ్యవహరిస్తున్నాయని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో భూమిలేని 75 లక్షల కుటుంబాలకు భూమి పంపిణీ చేయడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని ప్రకటించారు. ముస్లిం మహిళలను చట్టసభలకు పంపుతామని, ఎస్సీ, ఎస్టీలకు జనరల్ స్థానాల్లో కూడా అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన ఆయన, బీజేపీపై కూడా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు పెద్ద సంఖ్యలో రాజీనామా చేసి తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరగా, వారికి మల్లన్న కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు మరియు గ్రామస్థాయి వరకు పార్టీని బలోపేతం చేసి 2029లో అధికార సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## బండి సంజయ్ కుమారుడిపై పోక్సో కేసు: సమగ్ర విచారణ జరగాలి – తీన్మార్ మల్లన్న డిమాండ్



సందేశం టైమ్స్, మే 11, ప్రతినిధి: కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడిపై నమోదైన పోక్సో కేసు అంశంపై సమగ్రంగా, నిష్పక్షపాతంగా విచారణ జరపాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ చీఫ్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న డిమాండ్ చేశారు. న్యాయం అనేది సామాన్యుడి నుండి సంపన్నుడి వరకు ఒకే విధంగా అమలవాలని, ఎలాంటి పక్షపాతం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో భారతీయ జనతా పార్టీ నాయకత్వం స్వచ్ఛందంగా విచారణకు ముందుకు రావాలని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా వేగంగా స్పందించాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఇదే వేగంతో చర్యలు తీసుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. లేకపోతే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒకే విధంగా ఉన్నాయనే భావన ప్రజల్లో ఏర్పడుతుందని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన పారదర్శకమైన విచారణ ద్వారా బాధితులకు న్యాయం జరగాలని స్పష్టం చేశారు.

## ప్రధాని మోదీకి శ్రీరాముడి జ్ఞాపిక అందజేత



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 11, ప్రతినిధి: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్‌కు విచ్చేసిన సందర్భంగా కేంద్ర మంత్రి జీ. కిషన్ రెడ్డి సహా పలువురు నేతలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. హెచ్ఐసీసీలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీకి కిషన్ రెడ్డి శాలువాతో సత్కరించి అయోధ్య శ్రీరాముడి ప్రతిమను జ్ఞాపికగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పాల్గొన్నారు. సుమారు 9,400 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల సందర్భంగా రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి ప్రధానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఐపీఎల్ పాయింట్ల పట్టికలో ఆసక్తికర పోరు.. అగ్రస్థానంలో ఆర్సీబీ

| | Team | M | W | L | NRR | Pts |
|---|---|---|---|---|---|---|
| 1 | RCB | 11 | 7 | 4 | +1.103 | 14 |
| 2 | SRH | 11 | 7 | 4 | +0.737 | 14 |
| 3 | GT | 11 | 7 | 4 | +0.228 | 14 |
| 4 | PBKS | 10 | 6 | 3 | +0.571 | 13 |
| 5 | CSK | 11 | 6 | 5 | +0.185 | 12 |
| 6 | RR | 11 | 6 | 5 | +0.082 | 12 |
| 7 | KKR | 10 | 4 | 5 | -0.169 | 9 |
| 8 | DC | 11 | 4 | 7 | -1.154 | 8 |
| 9 | MI | 11 | 3 | 8 | -0.585 | 6 |
| 10 | LSG | 11 | 3 | 8 | -0.907 | 6 |

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 11, ప్రతినిధి: ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో ప్లేఆఫ్స్ రేసు అత్యంత ఉత్కంఠభరితంగా మారింది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానం కోసం జట్ల మధ్య హోరాహోరీ పోరు కొనసాగుతోంది. తాజా పరిస్థితుల ప్రకారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు 11 మ్యాచ్‌లలో 7 విజయాలతో 14 పాయింట్లు సాధించి మెరుగైన నెట్ రన్‌రేట్ ఆధారంగా మొదటి స్థానంలో కొనసాగుతోంది. అదే విధంగా 14 పాయింట్లు సాధించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు రెండో స్థానంలో, గుజరాత్ టైటాన్స్ మూడో స్థానంలో నిలిచాయి. పంజాబ్ కింగ్స్ జట్టు 10 మ్యాచ్‌లలో 13 పాయింట్లు సాధించి నాలుగో స్థానంలో ఉండగా, చెన్నై సూపర్ కింగ్స్ మరియు రాజస్థాన్ రాయల్స్ జట్లు చెరో 12 పాయింట్లతో తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నాయి. ఇక ముంబై ఇండియన్స్ మరియు లక్నో సూపర్ జెయింట్స్ జట్లు చెరో 6 పాయింట్లతో ప్లేఆఫ్స్ రేసులో వెనుకబడ్డాయి. రాబోయే మ్యాచ్‌లు ఈ సీజన్‌లో ప్లేఆఫ్స్ సమీకరణాన్ని పూర్తిగా మార్చే అవకాశం ఉన్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు.




## సీఎంగా విజయ్ ప్రమాణస్వీకారం.. తమిళనాట కొత్త ప్రభుత్వ కొలువు

సందేశం టైమ్స్, చెన్నై, మే 11, ప్రతినిధి: తమిళనాట రాజకీయ చరిత్రలో కీలక పరిణామంగా తేలుగు వెలుగు పార్టీ అధినేత విజయ్ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం అధికారికంగా కొలువుదీరింది. చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో జరిగిన భారీ ప్రమాణస్వీకార కార్యక్రమంలో విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయగా, ఆయనతో పాటు తొమ్మిది మంది మంత్రులు కూడా ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి వేలాదిమంది కార్యకర్తలు, అభిమానులు హాజరై సంబరాలు నిర్వహించారు. అనంతరం శాఖల కేటాయింపుల్లో భాగంగా సీఎం విజయ్‌కు హోం, ప్రజాపాలన శాఖలు అప్పగించగా, ఆధవ్ అర్జున్‌కు క్రీడలు మరియు ఎక్సైజ్ శాఖలు, సెంగొట్టాయన్‌కు ప్రజా పనుల శాఖ, వెంకట్రామన్‌కు పాఠశాల విద్యాశాఖ, ఎన్. ఆనంద్‌కు పురపాలక పరిపాలన శాఖ, నిర్మల్ కుమార్‌కు విద్యుత్ శాఖ, రాజమోహన్‌కు ఆదిద్రవిడ సంక్షేమ శాఖ, అరుణ్ రాజ్‌కు వాణిజ్య పన్నులు మరియు రిజిస్ట్రేషన్ శాఖలు కేటాయించబడ్డాయి. మరో ఇద్దరు మంత్రులు కీర్తన మరియు టీకే ప్రభులకు శాఖల కేటాయింపు ఇంకా పెండింగ్‌లో ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కొత్త ప్రభుత్వం ప్రజా సంక్షేమం, పారదర్శక పాలన, యువతకు ఉపాధి అవకాశాలు ప్రధాన లక్ష్యాలుగా పనిచేస్తుందని సీఎం విజయ్ స్పష్టం చేశారు.

## సింగపూర్ బయలుదేరిన నారా లోకేష్: అంతర్జాతీయ సమావేశాల్లో పాల్గొననున్న మంత్రి



సందేశం టైమ్స్, అమరావతి, మే 11, 2026, ప్రతినిధి: ప్రధాని నరేంద్ర మోదీతో తేనీటి విందు అనంతరం విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సింగపూర్ బయలుదేరారు. అక్కడ జరగనున్న వివిధ అంతర్జాతీయ సమావేశాల్లో ఆయన పాల్గొననున్నారు. అనంతరం రేపు సాయంత్రం ఢిల్లీకి చేరుకోనున్నారు. అలాగే గౌహతిలో మంగళవారం జరగనున్న అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి నారా లోకేష్ హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి హాజరుకావాలని స్వయంగా హిమంత బిశ్వ శర్మ ఆహ్వానించినట్లు సమాచారం.





## ప్రేమ వ్యవహారం విషాదం.. పెద్దపల్లిలో దళిత యువకుడి దారుణ హత్య కలకలం





సందేశం టైమ్స్, పెద్దపల్లి, మే 11, ప్రతినిధి: పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సింగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దళిత యువకుడు జూల వంశీ దారుణ హత్యకు గురైన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మంథని మండలం గాడిదలగండి సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఆదివారం ఉదయం కుళ్లిన స్థితిలో అతని మృతదేహం లభ్యమైంది. ఏప్రిల్ 30 నుంచి వంశీ కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాల్ డేటా విశ్లేషణలో వంశీకి హైదరాబాద్‌కు చెందిన ఓ యువతితో సంబంధాలు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు ఆమెతో పాటు ఆమె భర్తను విచారణకు తీసుకోగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం వంశీ గతంలో గ్రామానికి చెందిన ఓ యువతితో ప్రేమ వ్యవహారం కొనసాగించగా, ఆమె వివాహం అనంతరం భర్తతో కలిసి వెళ్లిపోయింది. అయితే ఇటీవల గ్రామంలో జరిగిన దేవతల కొలుపు సందర్భంగా ఆమె తిరిగి గ్రామానికి రావడంతో వంశీతో మళ్లీ ఫోన్ సంభాషణలు కొనసాగినట్లు తెలిసింది. ఈ విషయాన్ని తెలుసుకున్న యువతి భర్త ఆమె ద్వారానే వంశీని హైదరాబాద్‌కు పిలిపించి హత్య చేసినట్లు విచారణలో అంగీకరించినట్లు సమాచారం. అనంతరం మృతదేహాన్ని మంథని సమీపంలోని అటవీ ప్రాంతంలో పడేసినట్లు పోలీసులు గుర్తించారు. ఘటన జరిగి దాదాపు పది రోజుల తరువాత మృతదేహం కుళ్లిన స్థితిలో లభ్యమవడంతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. పోలీసులు కేసు నమోదు చేసి మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## నమో నారా బంధం: ప్రధాని మోదీకి సీఎం చంద్రబాబు ఆత్మీయ ఆతిథ్యం, నారా లోకేష్‌తో ఆప్యాయ భేటీ

సందేశం టైమ్స్, అమరావతి, మే 11, 2026, ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రధాని నరేంద్ర మోదీకి ఆత్మీయ ఆతిథ్యం అందించారు. ఈ సందర్భంగా వెంకటగిరి జామ్దానీ నేతతో తయారుచేసిన శ్రీ వేంకటేశ్వర స్వామి చిత్రాన్ని సీఎం కుటుంబం ప్రధానికి బహూకరించగా, రాష్ట్ర సంప్రదాయ వంటకాలతో తేనీటి విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ను ప్రధాని మోదీ ఆప్యాయంగా పలకరించి సాన్నిహిత్యంగా మాట్లాడారు. గతంలోనూ లోకేష్ పనితీరును ప్రధాని ప్రశంసించిన సందర్భాలు ఉన్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఢిల్లీలో తన నివాసానికి ఆహ్వానించి లోకేష్ కుటుంబాన్ని గౌరవించిన ఘటనలు కూడా గుర్తుకు వస్తున్నాయి. పెద్ద కార్యక్రమాల నిర్వహణలో లోకేష్ కృషిని ప్రధాని పలుమార్లు అభినందించినట్లు సమాచారం.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.